క్లుప్తంగా

పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు ఉచిత కోచింగ్

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌కు ఉచిత కోచింగ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. నాగు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గుడివాడ పరిసర ప్రాంతాలకు చెందిన 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈ శిక్షణ ఇస్తామన్నారు. పాలిటెక్నిక్ ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు అనుభవం కలిగిన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 98853 35189, 90101 48882లో సంప్రదించవలసిందిగా కోరారు.

వధూవరులకు ఆశీర్వాదం



గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని అలంకృత ఫంక్షన్ హాలులో నూతనంగా వివాహం అయిన నీష్మ, సాయితేజ దంపతులను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) గురువారం ఆశీర్వదించారు. ప్రముఖ కాంట్రాక్టర్ గోగినేని ఈశ్వర్ కుమార్ కుమార్తె అయిన నీష్మ వివాహానికి హాజరైన నాని వారికి శుభాకాంక్షలు చెప్పారు.

పన్ను చెల్లించి రాయితీ పొందండి

గుడివాడ టౌన్: పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తి, నీటి పన్ను బకాయిలు వెంటనే చెల్లించి వడ్డీ రాయితీ పొందవలసిందిగా మున్సిపల్ కమిషనర్ జి. బాల సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ లోగా బకాయిలు చెల్లించిన వారికే వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం ఈనెల 29 గుడ్‌ఫ్రైడే రోజు కూడా పురపాలక సంఘ కార్యాలయంలో పన్ను చెల్లించే వెసులుబాటు కల్పించామన్నారు.

మోటూరులో నారా భువనేశ్వరి పర్యటన



గుడివాడరూరల్: కృష్ణాజిల్లా గుడివాడ మండలంలోని మోటూరు గ్రామంలో నిజం గెలవాలి యాత్రను ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం నిర్వహించారు. చంద్రబాబు అరెస్ట్ విని బాధతో మరణించిన గ్రామానికి చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి భువనేశ్వరి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి చంద్రబాబు భరోసా పత్రాన్ని కుటుంబ సభ్యులకు ఆమె అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో అంగలూరు, పోలిమెట్లలో బాధిత కుటుంబాల్ని నారా భువనేశ్వరి గురువారం పరామర్శించారు. చంద్రబాబు అరెస్టు వార్త విని మృతి చెందిన అట్లూరి సంజీవరావు, రామారావు కుటుంబాలను ఆమె పరామర్శించి భరోసా కల్పించారు.

ప్రతిభా పరీక్షలలో విద్యార్థుల ప్రతిభ



పామర్రు: జనరల్ నాలెడ్జి అండ్ సైన్సు ఒలింపియాడ్ ప్రతిభా పరీక్షలలో ఏఎస్ఎం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ప్రిన్సిపల్ ఏ పూర్ణచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏఎస్ఎం హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఇంజినీర్స్ సిండికేట్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు నిర్వహించారన్నారు. రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో ధాత్రి శరణ్య, శ్రీదివ్య, వర్షిణి ముగ్గురు విద్యార్థినిలు గెలుపొంది బహుమతులు, ప్రశంసా పత్రాలను పొందారన్నారు.

ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ

జుఝువరం(పామర్రు): హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలలో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఉషోదయ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎండీ రఫీ అన్నారు. మండల పరిధి జుఝువరంలో గ్రామంలో ఉషోదయ హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థుల అభినందన కార్యక్రమం గురువారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో జరిగిన ఈ ఆటల పోటీలలో సీనియర్ బాలికల విభాగంలో ఖో-ఖో ఆటల పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని సాధించారని అన్నారు.

బ్లాక్ స్థాయి కీడా పోటీలు

ముదినేపల్లి రూరల్: స్థానిక సాయిరాం డిగ్రీ కళాశాలలో బ్లాక్ స్థాయి క్రీడాపోటీలు గురువారం నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా డ్వాక్రా మహిళలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రచారం.. ముమ్మరం

ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే కొడాలి నాని



ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: పట్టణంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గురువారం పట్టణంలోని 4, 5 వార్డులలో గురువారం పర్యటించారు. ఎమ్మెల్యే కొడాలి నానికి శ్రీరామ్‌పురం వాసులు గజమాలతో స్వాగతం పలికారు. శ్రీ కృష్ణ స్వామి వారికి కొడాలి నానీ ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు అభివాదం చేస్తూ పాదయాత్రగా ప్రచారాన్ని నిర్వహించారు. వీధి వీధిలో మహిళలు మంగళ హారతులు పట్టి కొడాలి నానీకి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రజలతో మమేకమై ప్రచారం సాగించారు. స్థానిక మహిళలు మార్కెట్ సెంటర్‌కు సంబంధించి లేవనెత్తుతున్న సమస్యలను ఓర్పుతో విని ఆ సమస్యలు తాత్కాలికమేనని తిరిగి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అవి తొలగిపోతాయని హామీ ఇచ్చారు. ఓటర్లు ఇళ్లలోకి ఆహ్వానించి ఆతిథ్యమిచ్చి చిరునవ్వుతో సాగనంపారు. చిన్నారులను, యువతను ఆప్యాయంగా పలకరిస్తూ వారితో సెల్ఫీలు దిగి సందడిచేశారు. ఈ సందర్భంగా కొడాలి నానీ మాట్లాడుతూ 20ఏళ్ల క్రితం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల అప్పును ఒక్క రూపాయి కట్టించుకుని ఓటీఎస్ ద్వారా రద్దు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆ పట్టాలను తిరిగి ప్రభుత్వ ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అందించి జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీని నిలుపుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, నాయకులు పాలేటి చంటి, పాలడుగు రామ్‌ప్రసాదు, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు చింతల భాస్కరరావు, వీరిశెట్టి నరసింహరావు, జ్యోతుల సత్యవేణి, జోగా సూర్య ప్రకాశరావు, షేక్ బాజీ, కె ఆంజనేయ ప్రసాదు, చుండూరి శేఖర్, ఎ కృష్ణ మోహన్, రమణకుమార్ పాల్గొన్నారు.

పేదల పార్టీని మళ్లీ గెలిపించండి



కలిదిండిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పథకాలు అమలు చేశారని, పేదల పక్షాన నిలిచే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తిరిగి అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి పరిధిలోని 3, 4వ వార్డులలో 3వ రోజు గుడ్ మార్నింగ్ కలిదిండి కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్యేకు కలిదిండి వాసులు హారతులు, పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కలిదిండిలో కల్పించలేని ఎన్నో మౌలిక వసతులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రతిపక్ష నాయకులు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలతో అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు బొర్రా సత్యవతి, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని రమేష్, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, ఎంపీటీసీ షఫాయితుల్లా, పీఏసీఎస్ అధ్యక్షులు వడుపు రామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు నీలపాల వెంకటేశ్వరరావు, అయినాల బ్రహ్మాజీ, మండల కో-ఆప్షన్ సభ్యులు హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే పట్టం కట్టాలి



అల్లూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దూలం స్వాతి, నాయకులు

ముదినేపల్లి రూరల్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో తరించే స్థానికులకే ఎన్నికల్లో పట్టం కట్టాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని అల్లూరులో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల తరఫున గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కైకలూరు అసెంబ్లీ కూటమి నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి ప్రజలకు ఏమాత్రం అందుబాటులో ఉండరన్నారు. ఇలాంటి వ్యక్తులను గెలిపిస్తే ఏం జరుగుతుందో 2014 ఎన్నికల్లో ప్రజలు చూశారన్నారు. ఆ విధంగా కాకుండా ప్రతి నిత్యం ప్రజలతో మమేకమయ్యే డీఎన్నార్ లాంటి వ్యక్తినే గెలిపించాలని కోరారు. అదే విధంగా ఏలూరు ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష కూటమి అభ్యర్థిగా కడప జిల్లా నుంచి దిగుమతి చేసుకున్న వ్యక్తి పోటీ చేస్తున్నారని, ఇలాంటి వారివల్ల ప్రజలకు ఏం మేలు జరుగుతుందని ప్రశ్నించారు. కూటమి అభ్యర్థుల మాయమాటలను ఎలాంటి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని హెచ్చరించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, సర్పంచ్ శీలం రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సతీష్‌బాబు, నాయకులు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, దివి సతీష్, పేర్ని పృథ్వీ, రాచూరి కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేసిన నాయకులను గెలిపించండి



ఆచవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి

కైకలూరు: ప్రజలకు మంచి చేసిన నేతలకు మరోసారి విజయం అందించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సతీమణి వీరాకుమారి అన్నారు. ఆచవరం గ్రామంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించారు. పార్టీలు చూడకుండా నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి డీఎన్నార్, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వింజరం, ఆచవరం సర్పంచ్‌లు ధర్మరాజుల నాగమణి, ఉలిసి వసంతకుమారి, నాయకులు బూరుబోయిన మోహనరావు, బుర్ల పోతురాజు, మాటపాటి చింతయ్య, సన్నిధి కృష్ణమూర్తి, ఉలిసి శ్రీనివాసరావు, పంతగాని యోహాను తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా వేంపాటి సాయి



కైకలూరు బార్ అసోషియేషన్ నూతన కమిటీ



హరినాథ్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

కైకలూరు: బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా వేంపాటి సాయి సత్యనారాయణ ఎన్నికయ్యారు. బార్ హాలులో జరిగిన ఎన్నికల్లో నూతన కమిటీని గురువారం ప్రకటించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలుగా బోడావుల ఇందిరా, సెక్రటరీగా ఎంఎస్ఎస్.రాజు, జాయింట్ సెక్రటరీగా ఎ.స్వరూప్, ట్రెజరర్‌గా జీవీ జితేంద్ర, లైబ్రరీ సెక్రటరీగా సీహెచ్ జయప్రకాష్, మహిళా ప్రతినిధిగా సుకన్యగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన బార్ కమిటీని న్యాయవాదులు తుమ్మలపల్లి బాలకృష్ణారావు, గొర్తి ప్రభాకరదీక్షితులు, తెలగంశెట్టి శ్రీనివాసరావు, గురజాడ ఉదయశంకర్, వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, మాడపాటి సత్యనారాయణరాజు, కారే శరత్‌బాబు తదితరులు అభినందించారు.

గుడివాడ అధ్యక్షుడిగా కొడాలి హరినాథ్

గుడివాడ టౌన్: ది గుడివాడ బార్ అసోసియేషన్ నూతన పాలక వర్గ ఎంపిక గురువారం జరిగింది. నూతన అధ్యక్షునిగా కొడాలి హరినాథ్ ఎంపికయ్యారు. బి. అజయ్‌బాబు ఉపాధ్యక్షుడిగా, మసిముక్కు నటరాజ్ ప్రధాన కార్యదర్శిగా, సీహెచ్ కుటుంబరావు లైబ్రరీ కార్యదర్శిగా, ఎస్. సాంబశివరావు జాయింట్ సెక్రటరీగా, ఎం. రాజేష్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా, కేవీ ప్రకాష్ కోశాధికారిగా, ఎం. జులేఖ మహిళా ప్రతినిధిగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన పటాన్ బాజీఖాన్ తెలిపారు. హరినాథ్‌ను ప్రముఖ న్యాయవాదులు ఎంవీ నారాయణరెడ్డి, కె. రవి, ఎంఎస్‌రెడ్డి, కె. మురళి, ఎండీ. రహమ్‌తుల్లా తదితరులు అభినందించారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



గుడివాడ టౌన్: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) గురువారం ఆవిష్కరించారు. స్థానిక త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక కార్యాలయంలో ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆచార్య ప్రబోధానంద యోగేశ్వరులు స్వామి వారు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలు జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థమయ్యే విధంగా ఈ క్యాలెండర్ రూపొందిందని సేవా సమితి నిర్వాహకులు అన్నారు. తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టత, భగవద్గీత సారాంశాలు ఇందులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందు జ్ఞాన వేదిక గుడివాడ, భీమవరం, నూజివీడు, మామిడికుదురు, ఆగిరిపల్లి సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా వైఎస్సార్ సీపీ

ఎమ్మెల్సీ జయమంగళ



కలిదిండి మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

కలిదిండి: ముస్లింల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కలిదిండి మసీదులో ఇఫ్తార్ విందులో గురువారం పాల్గొన్నారు. ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి ముస్లింలకు అండగా నిలిచారన్నారు. నేడు ఆయన తనయుడు ముస్లింలకు ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యపురాజు గుర్రాజు, బాషా, మేక భోగేశ్వరరావు, గుడివాడ ఫణి, లంక రత్నారావు, అబ్దుల్ అస్లాం, సైదు కామేష్, ఎంపీటీసీ చాన్ బాషా జావీద్, రబ్బానీ, ఫిరోజ్, రజక్, ఫడోస్, బేబీబుల్లా ఖాన్ పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ వెబినార్

కైకలూరు: వ్యాపారవేత్తలు డిజిటల్ మార్కెటింగ్‌లో నూతన పద్ధతులను ఆకళింపు చేసుకుని ఆర్థిక ప్రగతిని సాధించాలని కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ (సీసీఈఏపీ) జెడీ చప్పిడి కృష్ణ అన్నారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కామర్స్, ఎకనామిక్స్, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో 'డిజిటల్ ఎరాలో వ్యవస్థాపక మార్కెటింగ్' అనే అంశంపై బుధవారం ప్రారంభమైన ఆన్‌లైన్ అంతర్జాతీయ వెబినార్ గురువారంతో ముగిసింది. వెబినార్‌లో డిజిటల్ మార్కెటింగ్ వ్యూహాలు, స్టార్టప్ ఎకో సిస్టం, వ్యవస్థాపక నాయకత్వ నిర్వహణ, డిజిటల్ ఉత్పత్తి అభివృద్ధి, డిజిటల్ మార్కెటింగ్ బ్రాండింగ్ వంటి పలు అంశాలపై చర్చించారు. చివరి రోజు కొయంబత్తూరు నుంచి మాణిక్ ప్రసాద్, యూఎస్ఏ నుంచి చెట్టి ప్రసాద్ జూమ్‌లో డిజిటల్ మార్కెటింగ్ మెలకువలపై చర్చించారు. జూమ్ మీటింగ్‌లో పలు కళాశాలల అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ 500 మంది పాల్గొన్నారు. కైకలూరు కళాశాల ప్రిన్సిపాల్ బి.రఘునాథరెడ్డి అధ్యక్షత వహించిన వెబినార్ కార్యక్రమంలో స్థానిక కాలేజీ వెబినార్ కో-ఆర్డినేటర్లు కేపీ ఇమ్మానియేల్, పి.పాల్ దివాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పార్టీ కోసం శ్రమించిన వ్యక్తి రెడ్డిబాబు



ఉంగ్రపూడి(పామర్రు): పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి మురారి దామోదరరావు(రెడ్డిబాబు)అని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధి ఉంగ్రపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ కన్వీనర్ దామోదరరావు దశ దిన కర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే స్థానిక పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి బాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పోలీసుల కవాతు

పమిడిముక్కల: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని వేల్పూరు, ముళ్లపూడి, హనుమంతపురం, ఆలీనబీపాలెం, మేడూరు గ్రామాల్లో గురువారం కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసుల కవాతు నిర్వహించారు. ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు కవాతు నిర్వహించామని, ప్రజలందరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

61 మందికి టీబీ పరీక్షలు

మొవ్వ: ఐసీఎంఆర్ టీబీ టీమ్ టెస్టింగ్ టీమ్ గురువారం మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కూచిపూడి, పెదపూడి, అయ్యంకి గ్రామాల్లో 61 మందికి టీబీ పరీక్షలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ నందు టీబీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి శ్యాంపిల్ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీఎంఆర్ సైంటిస్ట్ డాక్టర్ కె. వెంకటేష్, డాక్టర్లు ఎస్. శంకర్, సైంటిస్ట్ అనూష, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అంబటి వెంకటేశ్వరరావు, అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో ఎం. వేదరాజ్ పాల్గొన్నారు.

సేవా నిరతి అభినందనీయం



కైకలూరు: పేద ప్రజల ఆకలి తీర్చాలనే మహోన్నత ఆలోచన రావడమే గొప్ప విషయమని సత్యసాయి ఏలూరు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు అన్నారు. కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో కైకలూరు సత్యసాయి సేవా సమితి ద్వారా రోగులు, సిబ్బందికి ప్రతి రోజూ ఉచిత భోజనాల ఏర్పాటు జరిగి ఏడాదైన సందర్భంగా ఆస్పత్రిలో అభినందన కార్యక్రమం గురువారం జరిగింది. నిర్వాహకులు మాట్లాడుతూ ఇప్పటివరకు 15,600 మందికి భోజనాలు ఉచితంగా అందించామన్నారు. ఇది నిరంతరం కొనసాగుతుందన్నారు. అనంతరం సేవ చేస్తున్న వ్యక్తులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అన్నప్రసాదాలయం ప్రారంభం

మండవల్లి: మండవల్లిలో కొలువైయున్న శ్రీ దత్త పరంపర షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం నూతనంగా నిర్మించిన అన్నప్రసాదాలయం, అర్చకస్వామి వసతిగృహాలను గురువారం ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధ మంగళ స్తోత్రం, మణిదీపవర్ణన, సాయిబాబాకు ప్రత్యేక పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు దంపతులు సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు.